క్లుప్తంగా

ఎమ్మెల్సీ అభ్యర్థులను గెలిపించుకుందాం

కళ్యాణదుర్గం: పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానాల్లో వైఎస్సార్‌సీపీ తరఫున బరిలో ఉన్న వెన్నపూస రవీంద్రారెడ్డి, రామచంద్రారెడ్డిని గెలిపించుకుందామని రాష్ట్ర స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి కేవీ ఉషశ్రీచరణ్ పిలుపునిచ్చారు. ఆదివారం మంత్రి ఫోన్‌లో 'సాక్షి'తో మాట్లాడారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు వైఎస్సార్‌సీపీ తరఫున బరిలో ఉన్న అభ్యర్థుల విజయానికి అందరూ సమష్టిగా పనిచేయాలన్నారు. ఆయా గ్రామ సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు అన్ని గ్రామాల్లో ఓటు హక్కు కలిగిన వారిని చైతన్య పరచాలన్నారు. ఓటు వేస్తే జరిగే మేలును వివరించాలన్నారు. సమయం తక్కువగా ఉన్నందున ప్రత్యేక ప్రణాళికతో ముందుకెళ్లాలన్నారు. ఆయా గ్రామాల్లోని నాయకులు సమన్వయంతో పనిచేస్తూ ఎమ్మెల్సీ అభ్యర్థుల విజయానికి కృషి చేయాలని మంత్రి సూచించారు.

ఉచిత శిక్షణకు ప్రవేశ పరీక్ష



పరీక్ష రాస్తున్న విద్యార్థులు

ఉరవకొండ: స్థానిక కరిబసవస్వామి ఉన్నత పాఠశాలలో నిస్వార్థ, అభయ ఫౌండేషన్ సంయుక్తంగా ఆదివారం ఉరవకొండ నియోజకవర్గంలోని ప్రభుత్వ పాఠశాలల్లో 4, 7, 10వ తరగతి విద్యార్థులకు నవోదయ, సైనిక్, ఏపీఆర్‌జేసీ, పాలిసెట్, ఆర్‌డీటీ సెట్‌కు సంబంధించి ఉచితంగా శిక్షణ ఇవ్వడానికి పరీక్ష నిర్వహించారు. ప్రవేశ పరీక్ష ప్రశ్నపత్రాలను ప్రధానోపాధ్యాయుడు వీరన్న, గణిత శాస్త్ర ఉపాధ్యాయుడు వెంకట్ విడుదల చేశారు. ఇందులో 4వ తరగతి నుంచి 40 మందిని, 7వ తరగతి నుంచి 40 మందిని ఎంపిక చేసి లాంగ్ టర్మ్ కోచింగ్ ఇప్పించనున్నట్లు వారు తెలిపారు. అలాగే 60 మంది 10 తరగతి విద్యార్థులను ఎంపిక చేసి ఏప్రిల్ చివరి వారం నుంచి ఉచితంగా శిక్షణ ఇస్తామన్నారు. కాగా నియోజకవర్గవ్యాప్తంగా 400 మంది విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారు.

కొండలకు నిప్పు పెట్టొద్దు

బెళుగుప్ప: ఆకతాయిలు గ్రామ సమీపాల్లోని కొండలకు వేసవిలో నిప్పుపెట్టడం హేయమైన చర్య అని గుండ్లపల్లి అటవీప్రాంతం బీట్ ఆఫీసర్ పెద్దన్న అన్నారు. మండలంలోని బెళుగుప్ప గుండ్లపల్లి, రమనేపల్లి అటవీ ప్రాంతంలోని పెద్ద కొండలకు శనివారం రాత్రి నిప్పు పెట్టడంతో పశుగ్రాసంతో పాటు చిన్న మొక్కలు కాలిపోయాయి. అటవీశాఖ సిబ్బంది వాచర్స్, బెళుగుప్ప తండావాసులు కలసి కొండలో మంటలు విస్తరించకుండా అదుపు చేసే ప్రయత్నం చేశారు. కొండ ప్రాంతాల్లో నిప్పుపెట్టడం వల్ల జింకలు, దుప్పిలు, ఎలుగుబంట్లు తదితర జీవాలు మృతిచెందుతాయని, నిప్పుపెట్టిన వారిపై కఠినచర్యలు తీసుకుంటామని బీట్ ఆఫీసర్ హెచ్చరించారు.

దాతలకు సన్మానం

కళ్యాణదుర్గం: పట్టణంలోని సరస్వతీ విద్యామందిరం అభివృద్ధికి పాటుపడుతున్న 30 మంది దాతలను పాఠశాల యాజమాన్యం ఘనంగా సన్మానించింది. సరస్వతీ విద్యామందిరం స్వర్ణోత్సవాల్లో భాగంగా ఆదివారం కార్యక్రమం నిర్వహించారు. ప్రధానాచార్యుడు కరణం తిరుమలరావు, సమితి కార్యదర్శి పాణ్యం రంగనాథ శర్మ, పాఠశాల కార్యదర్శి రామ్మోహన్ గుప్తా, అధ్యక్షుడు నరసింహమూర్తి, ఉపాధ్యక్షులు నాగభూషణం, హరికిశోర్, మయూర తదితరులు పాల్గొన్నారు.

నీలగిరిస్వామికి పూజలు




అలంకరణలో నీలగిరిస్వామి

వజ్రకరూరు: మండల కేంద్రంలో నీలగిరి స్వామి ఆలయంలో ఆదివారం సాయంత్రం విశేష పూజలు నిర్వహించారు. స్థానికులతో పాటు చుట్టుపక్కల గ్రామాలకు చెందిన భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయా నికి చేరుకుని స్వామిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో అర్చకులు, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

మామిడికి తెగుళ్ల బెడద

- ఉధృతంగా తామర, తేనెమంచు పురుగు
- దిగుబడులపై ప్రభావం
- ఆందోళనలో మామిడి రైతులు



పాలవాయి వద్ద మామిడితోటకు మందు పిచికారీ చేస్తున్న రైతు

కళ్యాణదుర్గం: వాతావరణంలోని మార్పుల కారణంగా మామిడి తోటలు తెగుళ్ల బారిన పడుతున్నాయి. చలి, మంచు తీవ్రత తగ్గి ఉష్ణోగ్రతలు పెరుగుతుండటం...అదే సమయంలో మామిడి తోటలు పూత దశలో ఉండటంతో తామర, తేనెమంచు పురుగు వేగంగా వ్యాపిస్తోంది. కళ్యాణదుర్గం, రాయదుర్గం, ఉరవకొండ నియోజకవర్గాల్లో 3,000 హెక్టార్లలో మామిడి తోటలు సాగులో ఉన్నాయి. దాదాపు 70 శాతం తోటలు ప్రస్తుతం పూతదశలో ఉన్నాయి. పది రోజుల నుంచి మంచు, చలి తగ్గి ఉష్ణోగ్రతలు పెరుగుతుండటంతో తెగుళ్ల వ్యాప్తికి అనుకూలంగా మారింది. ముఖ్యంగా మామిడిలో తామర, తేనె మంచు, గొంగళి పురుగుల తాకిడి ఎక్కువగా ఉండటంతో పూత పూర్తిగా దెబ్బతిని దిగుబడి తగ్గిపోయే ప్రమాదం ఉందని మామిడి రైతులు ఆందోళన చెందుతున్నారు.

పెరుగుతున్న పెట్టుబడులు..

మామిడి తోటలు పూతదశలో ఉన్న సమయంలో తెగుళ్ల తాకిడి పెరగడంతో నివారణకు పురుగు మందుల వినియోగంతో పెట్టుబడులు కూడా పెరుగుతున్నాయి. తేనె మంచు పురుగుల కారణంగా మసిమంగు తెగులు కూడా వేగంగా వ్యాపిస్తుండటంతో దిగుబడులపై ప్రభావం చూపనుంది. కాయ నాణ్యత దెబ్బతినే అవకాశం ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు. పలుమార్లు మందులు పిచికారీ చేసినా తెగుళ్లు తగ్గడం లేదని రైతులు వాపోతున్నారు. దీంతో పెట్టుబడులు పెట్టేందుకు జంకుతున్నారు. దిగుబడులు ఆశాజనకంగా లేకపోతే ఈసారి కూడా నష్టాలు తప్పవని మామిడి రైతులు వాపోతున్నారు. గత రెండేళ్లతో పోలిస్తే ఈ ఏడాది తెగుళ్ల తాకిడి విపరీతంగా పెరిగిందని, పూత కూడా ఆశించనంతగా రావడం లేదని రైతులు వాపోతున్నారు.

సస్యరక్షణ చర్యలతో తెగుళ్ల నివారణ..

మామిడిలో వేగంగా వ్యాపిస్తున్న తామర, తేనేమంచు పురుగు, మసిమంగు తెగుళ్ల నివారణకు సస్యరక్షణ చర్యలు అవసరమని ఉద్యాన శాఖ అధికారి ధనుంజయ, కేవీకే ఉద్యానవన శాస్త్రవేత్త డాక్టర్ యుగంధర్ తెలిపారు. తోటల్లో ఎండు పుల్లలు తొలగించి చెట్ల పాదులతో పాటు తోట చుట్టూ ఉన్న కలుపు మొక్కలను నివారించాలన్నారు. తామర పురుగు నివారణకు స్పైనోసాడ్ లేదా థయోమిథాక్సమ్ మందులను 3 మి.లీ. లేదా డైమిథోయేట్ మందు 2 మి.లీ.ను వేపనూనె 3 మి.లీ. కలిపి పిచికారీ చేయాలని సూచించారు. గొంగళిపురుగు నివారణకు ఇమామెక్టిన్ బెంజోయేట్ 4 మి.లీ. లేదా స్పైనోసాడ్ 35 మి.లీ.ను వేపనూనెతో కలిపి పిచికారీ చేయాలని తెలిపారు. తేనేమంచు పురుగు నివారణకు విప్రోపాజిన్ 2 మి.లీ లేదా ల్యామ్డా సైహాలోత్రిన్ 0.75 మి.లీ. లేదా ఇమిడాక్లోప్రిడ్ (పచ్చి పూత దశలో) 0.3 మి.లీను లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలని సూచించారు. పండు ఈగ సమస్య నివారణకు ఎకరాకు ఒక మెర్క్యురీలైట్‌ను ఏర్పాటు చేసుకోవాలని వారు సూచించారు.

చేసేది తప్పులు.. చెప్పేవి శ్రీరంగ నీతులా?

మాజీ మంత్రి కాలవపై విప్ కాపు రామచంద్రారెడ్డి ఫైర్



రాయదుర్గం: టీడీపీ హయాంలో జన్మభూమి కమిటీల పెత్తనం, ఏ స్థాయి ప్రజాప్రతినిధి అయినా, ఉన్నత స్థాయి అధికారి సంతకానికి ఉన్న విలువలాంటివి.. నీవు మంత్రిగా ఉండే సమయాన జన్మభూమి కమిటీలు చేసిన కంత్రీ పనులు అప్పుడే మరిచావా..? ప్రతి పథకానికి ఓ రేటు కట్టి పేదల రక్తాన్ని జలగలా పీల్చింది వాస్తవం కాదా..? అని ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి ప్రశ్నించారు. మాజీ మంత్రి కాలువ శ్రీనివాసులుపై ఆదివారం ఆయన తీవ్ర స్థాయిలో ఫైర్ అయ్యారు. ఇల్లు కావాలన్నా, రేషన్‌కార్డు పొందాలన్నా, సబ్సిడీ రుణం అందుకోవాలన్నా జనం జన్మభూమి కమిటీల వద్ద తలవంచేలా చేశారన్నారు. అలాంటి కర్కశత్వ పాలనకు స్వస్తి పలికి.. గ్రామ సచివాలయాలు, వలంటీర్ల వ్యవస్థను అందుబాటులోకి తీసుకురావడంతో పాటు దళారీ వ్యవస్థ మాటే వినిపించకుండా నేరుగా లబ్ధిదారుల ఖాతాలకే నగదు చేర్చిన ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి అన్నారు. ఇంతలా మంచి చేస్తున్న ప్రభుత్వంపై పనిగట్టుకుని నిత్యం బురదజల్లేలా ఆరోపణలు చేయడం నీ దిగజారుడు తనానికి నిదర్శనమన్నారు. చేసేవన్ని తప్పుడు పనులు.. చెప్పేవి మాత్రం శ్రీరంగ నీతులా..? అంటూ విప్ ఆగ్రహం వ్యక్తం చేశారు. పించన్ల పంపిణీలో పారదర్శకత కోసం పార్టీ నియామకాలు చేపట్టిన గృహసారథులు, సచివాలయ కన్వీనర్లను పాల్గొని పరిశీలన చేపట్టేలా ఇచ్చిన ఆదేశాలను మీడియా ముందు వక్రీకరిస్తూ మాట్లాడడం ఎంతవరకు సమంజషమని ప్రశ్నించారు. నిన్ను, నీ జన్మభూమి కమిటీలు, మీ అధినేత చంద్రబాబు ను ప్రజలు మళ్లీ కావాలని ఎందుకు కోరుకుంటారో చెప్పాలని నిలదీశారు. 2024 లో నీ పచ్చ పార్టీని ప్రజలు బంగాళాఖాతంలో కలిపేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై అనవసరపు ఆరోపణలు మానుకోకపోతే ప్రజలే తిరగబడే రోజులు దగ్గర్లో ఉన్నాయని హెచ్చరించారు.

ఆధ్యాత్మిక విద్యతోనే సన్మార్గం



మాట్లాడుతున్న సయ్యద్ ఆసిమ్ అబ్దుల్లాహ్ సాహెబ్

కణేకల్లు: ఆధ్యాత్మిక బోధనతోనే చిన్నారులు భవిష్యత్‌లో సన్మార్గంలో నడుస్తారని, ప్రతి ముస్లిం తమ పిల్లలకు ఆధ్యాత్మిక విద్య అందించాలని బెంగళూరుకు చెందిన తాలీమ్ బోర్డ్ కార్యదర్శి సయ్యద్ ఆసిమ్ అబ్దుల్లాహ్ సాహెబ్ సూచించారు. స్థానిక రామనగర్‌లోని ఈద్గా మక్తాబ్ (మదరసా)లో ఆదివారం వార్షికోత్సవం నిర్వహించారు. ఈసందర్భంగా సయ్యద్ ఆసిమ్, మౌలానా మునురిద్దీన్ సాబ్, రఫీక్ సమక్షంలో విద్యార్థులు ఖురాన్, హదీస్‌ను చదివారు. తప్పుడు పనులు చేయడం... మోసాలు చేయడం వంటివి అల్లాహ్‌కు ఇష్టం లేదని, ఐదు పూటలా నమాజ్ చేసి పుణ్యఫలాలు పొందాలని పలువురు విద్యార్థులు నాటికను ప్రదర్శించారు. కార్యక్రమంలో ఇమామ్‌లు, మౌజాన్‌లతో పాటు సుమారు 1,500 మంది హాజరయ్యారు.

పది ప్రజ్ఞ వికాస పరీక్షకు స్పందన



మాట్లాడుతున్న రైతు విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌని ఉపేంద్రరెడ్డి

రాయదుర్గంటౌన్: పదో తరగతి విద్యార్థుల్లో పబ్లిక్ పరీక్షలపై ఉన్న భయాన్ని పోగొట్టి పరీక్షలకు సన్నద్ధంగా చేసేలా ఎస్ఎఫ్ఐ, యూటీఎఫ్ ఆధ్వర్యంలో ఆదివారం చేపట్టిన ప్రజ్ఞ వికాస పరీక్షకు విశేష స్పందన లభించింది. పట్టణంలోని జెడ్పీ బాలికోన్నత పాఠశాలలో నిర్వహించిన ప్రజ్ఞ వికాస పరీక్షకు ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో చదువుతున్న పదో తరగతి విద్యార్థులు హాజరయ్యారు. ముఖ్య అతిథిగా హాజరైన వైఎస్సార్ సీపీ రైతు విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌని ఉపేంద్రరెడ్డి మాట్లాడుతూ పరీక్షల కోసం టెన్త్ విద్యార్థులను ముందస్తుగా సిద్ధం చేసేలా వారిలో ఆత్మస్థైర్యం నింపేందుకు ఇలాంటి ప్రతిభ పరీక్షలు దోహదపడుతాయన్నారు. కార్యక్రమంలో పల్లేపల్లి హైస్కూల్ హెచ్ఎం వెంకటరమేష్, యూటీఎఫ్ నాయకుడు వెంకటరామిరెడ్డి, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు బంగి శివ, కార్యదర్శి వంశీ, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

కళ్యాణదుర్గం: ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో స్థానిక కరణం చిక్కప్ప ఉన్నత పాఠశాలలో ఆదివారం నిర్వహించిన పదో తరగతి మోడల్ పరీక్షకు అనూహ్య స్పందన లభించింది. న్యాయవాది దేవేంద్ర, యూటీఎఫ్ రాష్ట్ర నాయకుడు ఈశ్వరయ్య, నాయకులు చిత్తయ్య, అశోక్, సాయిరాం, ఎస్ఎఫ్ఐ అచ్యుత్ ప్రసాద్, వంశీ ప్రశ్నపత్రాలను విడుదల చేశారు. వివిధ గ్రామాల నుంచి సుమారు 750 మంది విద్యార్థులు పరీక్షలు రాశారు. కార్యక్రమంలో యూటీఎఫ్ నాయకులు రమేష్, తిప్పేస్వామి, సుబ్రమణ్యం, సువర్ణ, ఏపీటీఎఫ్ నాయకులు మురళి, రాము, ఎస్టీయూ మల్లికార్జున, ఎస్ఎఫ్ఐ నాయకులు పాల్గొన్నారు.

గాయపడిన వలంటీర్ మృతి

రాయదుర్గంటౌన్: పట్టణంలోని 13వ సచివాలయం పరిధిలోని 25వ వార్డులో వలంటీర్‌గా విధులు నిర్వర్తిస్తున్న ధీరేంద్ర ఆదివారం ఉదయం మృతి చెందారు. కొద్దిరోజుల క్రితం ఇంట్లో నిప్పంటుకుని తీవ్ర గాయాలతో ఆయన కర్నూలు ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్న విషయం తెలిసిందే. పరిస్థితి విషమించడంతో ఆదివారం ఉదయం మృతి చెందినట్లు బంధువులు తెలిపారు.ఆయన మృతికి సంతాపం తెలియజేస్తూ తోటి వలంటీర్లు, సచివాలయ సిబ్బంది నివాళులర్పించారు.

వైఎస్సార్‌సీపీ నాయకుడి మృతి

గుమ్మఘట్ట: మండలంలోని భూపసముద్రం గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు పూసల శ్రీనివాసులు(48) అనారోగ్యంతో ఆదివారం మృతిచెందాడు. విషయం తెలుసుకున్న ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి కుటుంబసభ్యులకు సంతాపం తెలిపారు. అండగా ఉంటామని భరోసా కల్పించారు. అతడికి భార్య, ఇద్దరు కుమారులున్నారు.

పాఠశాలలో అసాంఘిక కార్యకలాపాలు

కూడేరు: పీఏబీఆర్ డ్యాంలో ఉన్న ప్రాథమిక పాఠశాల ప్రహరీకి గేటు లేకపోవడంతో కొందరు రాత్రి పూట స్కూల్లోకి వెళ్లి మందు తాగడం ఇతర అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి ప్రహరీకి గేటు ఏర్పాటు చేసి అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా చూడాలని పిల్లల తల్లిదండ్రులు, గ్రామస్తులు కోరుతున్నారు.

జోరుగా పశువుల జాతర



జాతరకు వచ్చిన పశువులు

రాయదుర్గం రూరల్: మండలంలోని 74 ఉడేగోళంలో మద్దానేశ్వర స్వామి రథోత్సవం పురస్కరించుకుని ఈ నెల 21 నుంచి పశువుల జాతర జోరుగా సాగుతోంది. పశువుల జాతరకు నియోజకవర్గంలోని వివిధ గ్రామాలతో పాటు ఆంధ్ర, కర్ణాటక ప్రాంతాల నుంచి భారీఎత్తున ఎద్దులు తరలి వచ్చాయి. జాతరకు వచ్చిన ఎద్దులకు దేవదాయశాఖ సిబ్బంది, ఆలయకమిటీ ఆధ్వర్యంలో తాగునీటి సౌకర్యం కల్పించారు. అలాగే రైతులకు భోజన వసతి కల్పిస్తున్నారు. జాతర మార్చి 1వ తేదీ వరకూ కొనసాగనుంది.

పద్ధతి మార్చుకోకపోతే కఠిన చర్యలు



రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న ఎస్ఐ వెంకటస్వామి

ఉరవకొండ: రౌడీషీటర్లు పద్ధతి మార్చుకోకపోతే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ వెంకటస్వామి హెచ్చరించారు. ఆదివారం రౌడీషీటర్లకు స్థానిక స్టేషన్‌లో ఎస్ఐ కౌన్సెలింగ్ ఇచ్చారు. రౌడీషీటర్లు గ్రామాల్లో గొడవలు సృష్టించడం, కొనసాగించడం తదితర పద్ధతులు మార్చుకపోతే, కేసులు పెట్టి రిమాండ్‌కు తరలిస్తామన్నారు. ఇప్పటికైనా మంచి నడవడికతో గ్రామాల్లో పనులు చేసుకుని జీవించాలని సూచించారు.

నేటి నుంచి జొన్న కొనుగోళ్లు



మాట్లాడుతున్న సివిల్ సప్లయిస్ డీఎం నీలమయ్య

విడపనకల్లు: రైతు భరోసా కేంద్రా(ఆర్‌బీకే)ల్లో సోమవారం జొన్న కొనుగోళ్లు ప్రారంభిస్తున్నట్లు సివిల్ సప్లయిస్ డీఎం నీలమయ్య తెలిపారు. ఆదివారం విడపనకల్లులోని ఆర్‌బీకేలో జొన్న కొనుళ్లపై రెవెన్యూ, వ్యవసాయ శాఖల ఆధ్వర్యంలో ఆయన సమావేశం నిర్వహించారు. డీఎం మాట్లాడుతూ రైతులు దళారుల చేతిలో తక్కువ ధరకు జొన్న అమ్ముకుని మోసపోరాదని సూచించారు. ప్రభుత్వం నిర్ణయించిన క్వింటాలు రూ.2,990 మద్దతు ధరతో రైతు నుంచి జొన్న కొనుగోలు చేస్తోందన్నారు. విక్రయించదలచిన రైతులు ఆర్‌బీకేలో పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో తహసీల్దార్ బ్రహ్మయ్య, ఏఏఓ పెన్నయ్య, ఏఈఓ రాఘవేంద్ర, ఆర్ఐ గోవిందురెడ్డి, వీఆర్వోలు, వీఏఏలు, ఎంపీఈఓలు తదితరులు పాల్గొన్నారు.


రోడ్డు ప్రమాదంలో సర్పంచుకు గాయాలు



గాయపడిన శ్రీనివాసులురెడ్డి

కూడేరు: మండలంలోని గొటుకూరు వద్ద అనంతపురం–బళ్లారి ప్రధాన రహదారిపై ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో వజ్రకరూరు మండలం రాగులపాడు సర్పంచ్ శ్రీనివాసులు రెడ్డి తీవ్రంగా గాయపడ్డాడు. పోలీసుల వివరాల మేరకు.. కూతురు పల్లవితో కలసి ఆయన ద్విచక్ర వాహనంలో అనంతపురంలో చదువుతున్న కుమారున్ని చూసేందుకు బయలుదేరాడు. ఘటనా స్థలికి రాగానే అనంతపురం నుంచి వస్తున్న టిప్పర్ గొటుకూరుకు వెళ్లేందుకు మలుపు వద్ద వేగంగా తిరుగుతూ ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టింది. ఘటనలో శ్రీనివాసులు రెడ్డి తలకు తీవ్ర గాయాలయ్యాయి. కూతురుకు కూడా గాయాలయ్యాయి. క్షతగాత్రులను వెంటనే 108లో అనంతపురానికి తరలించారు. ఏఎస్ఐ రామానాయుడు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. విషయం తెలుసుకున్న ఉరవకొండ మాజీ ఎమ్మెల్యే వై. విశ్వేశ్వరరెడ్డి ఆస్పత్రికి వెళ్లి క్షతగాత్రులను పరామర్శించి, మెరుగైన వైద్యం అందించాలని వైద్యులకు సూచించారు.

నిండుకుండలా సమ్మర్ స్టోరేజీ ట్యాంకు



తుంగభద్ర జలాలతో నిండుగా కణేకల్లులోని సమ్మర్‌స్టోరేజీ ట్యాంకు

రాయదుర్గంటౌన్: పట్టణానికి తాగునీటిని సరఫరా చేస్తున్న కణేకల్లులోని డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి హెచ్చెల్సీ శాశ్వత తాగునీటి పథకం సమ్మర్ స్టోరేజీ ట్యాంకు(ఎస్ఎస్ ట్యాంకు) పూర్తిస్థాయి నీటిమట్టంతో జలకళ సంతరించుకుంది. ఎస్ఎస్ ట్యాంకు పూర్తిస్థాయి నీటి మట్టం 3050 మిలియన్ లీటర్లు కాగా ప్రస్తుతం పూర్తిస్థాయికి చేరుకుంది. పట్టణానికి రోజూ 7.5 ఎంఎల్‌డీ నీరు సరఫరా చేస్తుండగా అదే నిష్పత్తితో హెచ్చెల్సీ కాలవకు నీటి సరఫరా నిలిపివేసినా బ్యాక్ వాటర్ ఉన్నంత వరకు ఎస్ఎస్ ట్యాంకులో నీటి పంపింగ్ జరుగుతుందని కమిషనర్ దివాకర్‌రెడ్డి, డీఈ రామ్మూర్తి తెలిపారు. పట్టణంలోని జీఎల్ఎస్ఆర్‌లకు నీటి పంపింగ్‌ను బట్టి కాలనీల వారిగా రోజు విడిచి రోజు ప్రజలకు నీరు సరఫరా అవుతోందన్నారు. లీకేజీల మరమ్మతు సమయంలో అప్పుడప్పుడు సరఫరాలో అంతరాయం ఏర్పడుతోందన్నారు. ఎస్ఎస్ ట్యాంకులో నీటి నిల్వతో ఈ ఏడాది తాగునీటికి ఏ మాత్రం కొరత ఉండదన్నారు.

ఈ-పంట నమోదు తప్పనిసరి

బొమ్మనహాళ్: రబీలో సాగు చేసిన పంటలకు ఈ-పంట నమోదు చేసుకోవడానికి ప్రభుత్వం ఈ నెల 28 వరకూ అవకాశం ఉందని మండల వ్యవసాయాధికారి అహమ్మద్‌బాషా తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ ప్రతి రైతూ సాగు చేసిన పంటల వివరాలను రైతు భరోసా కేంద్రానికి వెళ్లి వ్యవసాయ సహాయకుడి ద్వారా ఈ-పంట నమోదు చేయించుకోవాలన్నారు. ఈ పంట నమోదు చేయించుకోని రైతులకు ప్రభుత్వ పథకాలైన కనీస మద్దతు ధర, ఇన్‌పుట్ సబ్సిడీ, ఇతర పథకాలు వర్తించవన్నారు.

ద్విచక్రవాహనాల ఢీ


- ఒకరికి గాయాలు



గాయపడిన హరీష్

కళ్యాణదుర్గం: పట్టణంలోని మారెంపల్లి సమీపంలో ఆదివారం రాత్రి రెండు ద్విచక్రవాహనాలు ఢీ కొన్నాయి. ఘటనలో పట్టణానికి చెందిన హరీష్‌కు తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు కళ్యాణదుర్గం ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం అతడిని అనంతపురం తరలించారు. పట్టణ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

● 50 ఏళ్ల తర్వాత కలుసుకున్నారు!



అప్పటి గురువులతో పూర్వ విద్యార్థులు

రాయదుర్గంటౌన్: పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఆదివారం పూర్వ విద్యార్థులు సందడి చేశారు. 1971–73లో ఇంటర్ చదివిన 90 మందికిగాను ఆత్మీయ సమ్మేళనానికి 70 మంది కుటుంబ సభ్యులతో హాజరయ్యారు. ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకుని, యోగక్షేమాలు, కష్టసుఖాలు తెలుసుకున్నారు. అప్పటి గురువులు విశ్వనాథశెట్టి, వెంకటసత్యంను ఘనంగా సత్కరించారు. అనంతరం వివిధ కారణలతో మృతి చెందిన 13 మంది పూర్వ విద్యార్థులు, 10 మంది గురువులకు నివాళులర్పిస్తూ మౌనం పాటించారు. పూర్వ విద్యార్థులు రాధాకృష్ణ, సుధీర్, సత్యనారాయణ, చల్లా మధుసూదన్, జయంతి రమేష్ తదితరులు పాల్గొన్నారు.